నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, బుధవారం 20 డిసెంబర్ 2023 | RAJANNA SIRCILLA

బో'నమో' పోచమ్మ

రాజన్న అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మకు భక్తులు మంగళ వారం ఘనంగా బోనాలు సమర్పించారు. రాజన్నను దర్శించుకున్న తర్వాత బద్దిపోచమ్మ ఆలయంలో బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో భక్తిశ్రద్ధలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ పురవీధులగుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కల్లు పోసి, సారెపెట్టి బోనాలు సమర్పించారు. బోనం సమర్పించడానికి భక్తులు బారులు తీరారు.

- వేములవాడ టౌన్, డిసెంబర్ 19

బోనాల సమర్పణకు బారులు తీరిన భక్తులు

ముంపు గ్రామాలకు ₹5 కోట్ల పరిహారం

పరిహారం అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, డిసెంబర్ 19 : అనుపురం, రుద్రవరం, సంకెపల్లికి చెందిన ముంపు గ్రామాల నిర్వాసితులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన దాదాపు ₹5 కోట్ల ఇంటి పరిహారం చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 14 మంది అనుపురం గ్రామస్తులు, 44 మంది రుద్రవరం గ్రామస్తులు, ఇద్దరు సంకెపల్లి గ్రామస్తులకు చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడారు. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఆ తర్వాత విప్‌ను జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ ఘనంగా సన్మానించారు.

గొల్లపల్లిలో ల్యాగల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

- ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా
- సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృత పర్యటన
- పలు కుటుంబాలకు పరామర్శ
- పలుచోట్ల నూతన వధూవరులకు ఆశీర్వాదం

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటానని ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భరోసానిచ్చారు. మంగళవారం ఆయన గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాలతోపాటు సిరిసిల్ల పట్టణంలో పర్యటించారు. మరమగ్గాల కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీవైనగర్‌లో దార్ల వీరేశం ఇటీవల మృతి చెందగా, కుటుంబ సభ్యులైన కౌన్సిలర్ దార్ల కీర్తన, బీఆర్ఎస్ నేత సందీప్‌ను పరామర్శించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నేత తవుటు కనకయ్య మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు టీవీ నారాయణ, మధు, చందును పరామర్శించారు. తవుటు కనకయ్య విగ్రహాన్ని సుందరయ్యనగర్‌లో ఏర్పాటు చేయాలని సీఐటీయూ నేత మూషం రమేశ్ వినతిపత్రం అందించగా, రామన్న సానుకూలంగా స్పందించారు. ముస్తాబాద్ మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య కుమారుడు రాజు-సాయిపూజ వివాహం ఇటీవల కాగా, నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత రాచమడుగు సంతోష్ రావు తండ్రి కిషన్‌రావు, నామాపూర్‌లో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తాడెపు రవి తండ్రి బాలమల్లు మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. గూడెంలో మాజీ సర్పంచ్ ఆవునూరి ఎల్లం కూతురు దీపిక వివాహం ఈ నెల 22న జరుగనుండగా, నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. దమ్మన్నపేటలో కొత్తింటి బాలమణి-వెంకట్‌రెడ్డి కొడుకు వివాహ విందుకు హాజరై, నూతన వధూవరులు సందీప్-భావనను ఆశీర్వదించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి పాపిరెడ్డి, ముచ్చ సత్తిరెడ్డి తల్లి రాజమ్మ, బొప్పాపూర్‌లో మాజీ సర్పంచ్ రామ భీమేశ్ తల్లి యశోద ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు. అలాగే నూతన జంటలను నిండు నూరేండ్లు చల్లంగా ఉండాలని దీవించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన ఏడు గ్రామాలను యథాతథంగా ఉంచాలని గ్రామస్తులంతా క్యాంపు కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేయగా, తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. విలీన గ్రామాలన్నీ తిరిగి పంచాయతీలుగా మార్చేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపించాలని చైర్‌పర్సన్ జిందం కళకు సూచించారు. సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి కృషి చేస్తానని చెప్పారు. ఆయాచోట్ల కేటీఆర్ వెంట జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీవైనగర్‌లో మరమగ్గాల కార్మికులను పలుకరిస్తున్న కేటీఆర్

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ఏం కొనేటట్టు లేదు

- నిత్యావసర వస్తువుల ధరలు పైపైకి..
- పదిహేను రోజుల్లో భారీగా హైక్
- సామాన్యులపై పెనుభారం
- అమ్మకాలు అంతంతే అంటున్న వ్యాపారులు
- దిగుబడులు పడిపోవడమే కారణమా..?

నిత్యావసరాల ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. సామాన్యులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పెరుగుతున్న రేట్లు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు పెనుభారంగా మారాయి. ఏడాది కాలంలో నాలుగు సార్లు పెరిగిన ధరలు ఈ నెలలో పూర్తిగా నియంత్రణ కోల్పోయాయి. ఏది కొనాలన్నా అగ్గిలో చెయ్యి పెట్టినట్టే ఉన్నది. నిత్యావసర వస్తువులు లేనిదే పూట గడవని పరిస్థితిలో పేద కుటుంబాలు ఎప్పటికప్పుడు అవసరాన్ని బట్టి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. బియ్యం, నూనెలు, పప్పులు, అల్లం, ఉల్లి, వెల్లుల్లి ధరల్లో భారీ తేడా కనిపిస్తున్నది. ఫలితంగా అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. మొత్తానికి పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో బతుకులు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని సామాన్యులు లబోదిబోమంటున్నారు.

కరీంనగర్ ప్రధాన కూరగాయల మార్కెట్‌లో అల్లం కొనుగోలు చేస్తున్న మహిళ

కరీంనగర్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : సామాన్యుడికైనా, కోటీశ్వరుడికైనా నిత్యావసర సరుకులు లేనిదే పూట గడవదు. ఇవి అందుబాటులో ఉంటేనే కొనగలిగే శక్తి ఉంటుంది. పూట గడుస్తుంది. కానీ, ఇప్పుడు మార్కెట్‌లో ధరలు చూస్తే కోటీశ్వరులేమోగానీ సామాన్యులకైతే చుక్కలు కనిపిస్తున్నాయి. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ధరలు శరాఘాతంగా మారాయి. ఏడాది ప్రారంభంలో జనవరి, ఏప్రిల్, జూన్ నెలల్లో పెరిగిన నిత్యావసరాల ధరలు పెద్దగా ప్రభావం చూపలేదు. ఒక్కో వస్తువుపై రూపాయి నుంచి రెండు రూపాయలు అట్లా పెరుగుతూ వచ్చేవి. గత నెల చివరి వరకు కూడా నియంత్రణలో కనిపించాయి. కానీ, నవంబర్‌లో ధరలు విపరీతంగా పెరిగాయి. ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, కారం, పసుపు, ఉప్పు, పప్పు ఇలా ఏది చూసినా హైక్ అయ్యాయి.



గత నెలలో కిలో ₹130 ఉన్న కందిపప్పు ఇప్పుడు ₹170కి చేరగా, చింతపండు అయితే ₹70 నుంచి ₹120కి చేరింది. అలాగే పసుపు ₹120 నుంచి ₹180కి పెరిగింది. ఇక కారం పొడి ₹200 నుంచి ₹320కి ఎగబాకింది. ఎండు మిర్చి ₹150 నుంచి ₹280కి చేరగా, ఎల్లిగడ్డ అయితే ఏకంగా ₹200 నుంచి ₹340కి పెరిగింది. జీల కర్ర కిలో ధర చూస్తే ఏడాదిలో ₹200 నుంచి ₹560కి చేరింది. నువ్వులు, శనగలు, పల్లీలు, బబ్బెర్లు, ఉల్లి, అల్లం, పామాయిల్, తదితర ప్రతి నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశన్నంటుతున్నాయి. అయితే ఈ యేడాదిలో నాలుగుసార్లు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా ఇంత పెద్ద మొత్తంలో ఎన్నడూ పెరగలేదని ఇటు వ్యాపారులు, అటు వినియోగదారులు వాపోతున్నారు. గత నెలకు, ఇప్పటికి ఇంత తేడా ఏమిటని నోరెళ్లబెడుతున్నారు. ఇంత ధరలు పెట్టి కొనలేమని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గత నెలకు ఈ నెలకు 50శాతం అదనపు ఖర్చులు మీదపడుతున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు కూరగాయలు, చికెన్, మటన్ ధరలు మండి పోతుండడంతో ఏం కొనా లో.. ఏం తినాలో తెలియక అయోమయ స్థితికి గురవుతున్నారు. చేతిలో ఉన్న డబ్బులకు సరిపడా నిత్యావసరాలు కొని పూట గడుపుతున్నారు. పేద కుటుంబాలకు చెంది న వినియోగదారులైతే ఏ పూటకు ఆపూట అన్నట్లుగా కాలం గడుపుతున్నారు. నానాటికీ పెరుగుతున్న ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉందని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉత్పత్తులు పడిపోవడంతోనే ధరలు విపరీతంగా పెరిగాయని తెలుస్తుండగా, దీనిని ఆసరాగా చేసుకుని కొంద రు వ్యాపారులు బ్లాక్ చేస్తున్నారని, ధరలు పెంచుతున్నారని ఆరోపిస్తున్నారు. పౌర సరఫరాల అధికారులు ఈ విషయమై దృష్టి సారించి ధరలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధరలు బాగా పెరిగినయి

ఇటీవల ధరలు బాగా పెరిగినయి. పంటల ఉత్పత్తి పడిపోవడం, కొన్ని దేశాల నుంచి దిగుమతి కాకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. మన రైతులు కూడా వరికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి ఇతర పంటలవైపు చూడడం లేదు. నిత్యావసర సరకులు చాలా మట్టుకు స్థానికంగా పండేవే. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అందుకే వీటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నయి. ఇప్పటికే ధరలు విపరీతంగా పెరగడంతో వినియోగదారులు తక్కువగా కొంటున్నరు. ధరలు తక్కువ ఉంటేనే మాకు ఎక్కువ గిరాకీ అయ్యేది. గత నెలలో పూర్తి దినుసు కొన్న వాళ్లు ఈ నెలల సగం సగమే కొంటున్నరు. గిరాకీ దెబ్బతిన్నట్లే కదా.

- కొసనగొట్టు శ్రీధర్, రిటైల్ వ్యాపారి

సగం సామాను వస్తలేదు

మార్కెట్ వస్తే చుక్కలు కనిపిస్తున్నయి. ఏదీ కొనేటట్టు లేదు. ధరలు బాగా పెరిగినయి. మా అసోంటి సామాన్యులు కొనలేని ధరలు కనిపిస్తున్నయి. పోయిన్నెల ఇంటికి అవసరమైన మొత్తం సామన్ కొనుక్కపోతే ఇప్పుడు సగం సామాను సుతం వస్తలేదు. ఒక్కొక్క వస్తువు మీద ఊహించని తీర్గ ధర పెరిగింది. గతంల ₹2,500 పెడితే ఇంటికి అవసరమైన వస్తువులు వచ్చేటియి. ఇప్పుడు ₹5 వేలు పెట్టినా వస్తలేవు. నెలకు పది వేలు మాత్రమే సంపాదించుకునెటోళ్లు ఎట్ల బతుకుతరు? ఏ పూటకు ఆపూట కొనుక్కొని తినుడే. ఉంటే తినుడు, లేకుంటే పస్తులు ఉండుడైతది.

- వీ శ్రీలత, వెలిచాల (రామడుగు)

గతనెల, ఈనెల నిత్యావసరాల ధరలు (కిలో రూపాయల చొప్పున)

నిత్యావసర వస్తువు	నవంబర్	ప్రస్తుతం
సన్ ఫ్లవర్ (నూనె)	102	107.50
పామాయిల్	60	80
మినప పప్పు	115	130
కంది పప్పు	130	170
పెసర పప్పు	105	120
శనగ పప్పు	60	75
శనగలు	60	80
పల్లీలు	100	130
బబ్బెర్లు	70	95
బబ్బెర పప్పు	80	100
కాబూల్ శనగలు	100	180
నువ్వులు	130	180
చింతపండు	70	120
పసుపు	120	180
కారంపొడి	200	320
ఎండు మిర్చి	150	280
ఆవాలు	80	120
ధనియాలు	70	120
ఉప్మా రవ్వ	30	40
ఇడ్లీ రవ్వ	35	40
చక్కెర	40	38
అల్లం	120	130
వెల్లుల్లి	200	340
ఆలుగడ్డ	25	30
ఉల్లి గడ్డ	40	50

సమస్యలు తెలుసుకునేందుకే 'గుడ్ మార్నింగ్'

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- ఇబ్రహీంపట్నంలో పాదయాత్ర

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19 : ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గుడ్ మార్నింగ్ కార్యక్రమం చేపట్టినట్లు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. అందులో భాగంగానే మంగళవారం ఉదయం 7 గంటలకు ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలోని కొత్తబస్టాండ్ నుంచి పాతబస్టాండ్ వరకు పాదయాత్ర చేశారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన దృష్టికి వచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ప్రజలను కంటిరెప్పలా కాపాడుకుంటానని, యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు సాధ్యమైనంత త్వరగా కృషి చేస్తానన్నారు. యువత మంచి మార్గంలో వెళ్లాలని, సోషల్ మీడియాకు ఆకర్షితులు కాకుండా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యేను పలువురు నాయకులు, మండల స్థాయి అధికారులు పుస్తకాలు, పెన్నులను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేమూరి లత, వైస్ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు తిమ్మని రాములు, చిన్నారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, వైస్ చైర్మన్ జిల్లాల పవన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ప్రజలకు రుణపడి ఉంటా

- బీఆర్ఎస్ పాలనలోనే వ్యవసాయం పండుగైంది
- ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
- వంద రోజుల వరకు ఎదురుచూస్తాం
- అమలు చేయకుంటే ఉద్యమిస్తాం
- మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

గంగుల కమలాకర్‌ను సన్మానిస్తున్న మండల ప్రజా ప్రతినిధులు

కొత్తపల్లి, డిసెంబర్ 19: కరీంనగర్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరుసగా నాలుగుసార్లు గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని, తుదిశ్వాస వరకూ వారి సేవలోనే తరిస్తానని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భరోసానిచ్చారు. కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతా మహేశ్ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడారు. పదిహేనేండ్ల కాలంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా కరీంనగర్ నియోజకవర్గాన్ని గొప్ప గా అభివృద్ధి చేశానని, బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయాన్ని పండుగ చేశామని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని సర్కారు పది రోజులు గడుస్తున్నా చేసిందేమీలేదన్నారు. రైతుబంధు కూడా పూర్తిగా ఇవ్వలేదని ఆక్షేపించారు. రైతులు కాంగ్రెస్ వాగ్దానాల అమలు కోసం ఆశతో చూస్తున్నారని చెప్పారు. హామీల అమలుకు 100 రోజులదాకా ఎదురు ఎదురుచూస్తామని, అప్పటి వరకు నెరవేర్చకుంటే నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు పోరాటాలు కొత్తకాదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదన్నారు. అలాగే బోనస్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటికి 200 యూనిట్లు రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలన్నారు. అధికారులు కొత్త ప్రభుత్వం చేపట్టే పనులతోపాటు పాత ప్రభుత్వం చేపట్టిన పనులను కూడా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ పిట్టల కరుణ, జడ్పీకో ఆప్షన్ సభ్యుడు షాబీర్ పాషా, ఎంపీడీవో ఏ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వద్దు

- కరీంనగర్ మేయర్ సునీల్‌రావు

మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 19: మంచి నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం మంచి నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు, కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్, ప్రస్తుతం నీటి సరఫరాలో తలెత్తే సమస్యలు, లీకేజీలు, వాల్స్ రిపేర్, ఇంటర్ కనెక్షన్స్‌పై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమయానికి అనుగుణంగా ప్రతి రోజూ నీటిని సరఫరా చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను పూర్తి స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలీన గ్రామాల డివిజన్ల పరిధిలో మంచి నీటిపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాని ఆదేశించారు. ప్రధానంగా అంబేడ్కర్ రిజర్వాయర్ పరిధి నీటి సరఫరాలో తరుచుగా సమస్యలు తలెత్తుతున్నాయని, ఎక్కడ సమస్య వస్తుందో పరిశీలన చేసి పరిష్కరించాలని సూచించారు. నీటి సరఫరా సమయంలో లైన్‌మెన్, సిబ్బంది ఫీల్డ్ లెవల్‌లో తిరుగుతూ పర్యవేక్షణ చేయాలన్నారు. లీకేజీలను అరికట్టాలన్నారు. ఫిల్టర్ కెపాసిటీ ప్రకారం మానేరు డ్యాం నుంచి రా వాటర్ సేకరించి నీటిని శుద్ధీకరణ చేయాలన్నారు. వచ్చే సంవత్సరం జనవరిలో 24 గంటల నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ కిష్టప్ప, మహేందర్, డీజల్, ఏఈలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్

పాదయాత్రలో నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

యైటింక్లయిన్ కాలనీ డిసెంబర్ 19 : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారి కాలనీకి వచ్చిన ఆయనకు మంగళవారం మాజీ కౌన్సిలర్ మారెల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ చౌరస్తా నుంచి 18వ డివిజన్ అల్లూరు వరకు పర్యటించారు. హనుమాన్ దేవాలయంలో పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. అల్లూరులోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించడంతోపాటు అధునాతన సౌకర్యాలు కల్పిస్తామని, గ్రామంలో మహిళా భవన్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గుండేటి రాజేశ్, ఫ్లోర్ లీడర్ మహాంకాళి స్వామి, మార్క రాజు, మారెల్లి సర్వోత్తమ్‌రెడ్డి, ఎండీ అన్వర్, రమేశ్, చక్రపాణి, కిషన్‌నాయక్, లక్ష్మణ్‌రావు, ఫయాజ్, రేశవేని కేశవులు, గపూర్, సొప్పదండి దుర్గాప్రసాద్, చాట్ల సదానందం పాల్గొన్నారు.